శివారులో 'ధార్'.. సిటీలో 'చుడీదార్' చోర్

- నగరంలో రెండు గ్యాంగ్‌ల హల్‌చల్
- హైదరాబాద్‌లోకి అంతర్రాష్ట్ర దొంగలు
- 'గేటెడ్ ', అపార్ట్‌మెంట్లే టార్గెట్
- అప్రమత్తం చేస్తున్న పోలీసులు

నగర శివారులో దొంగతనానికి బయలుదేరిన ధార్ గ్యాంగ్ సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యం

హైదరాబాద్‌లో సంచరిస్తున్న చుడీదార్ గ్యాంగ్ సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 14 (నమస్తే తెలంగాణ): ఇటు నగరం లోపల, అటు శివారులో అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. శివారులో మధ్యప్రదేశ్‌కు చెందిన 'ధార్' గ్యాంగ్, సిటీలోపల 'చుడీదార్' గ్యాంగ్ హల్‌చల్ చేస్తున్నాయి. శివారులో గేటెడ్ కమ్యూనిటీలను ధార్ గ్యాంగ్ టార్గెట్ చేస్తుండగా నగరంలోని అపార్ట్‌మెంట్లను చుడీదార్ గ్యాంగ్ లక్ష్యంగా చేసుకొని రెచ్చిపోతున్నాయి. ఆరు నెలల ముందువరకు హైదరాబాద్‌వైపు చూడాలంటేనే భయపడ్డ అంతరాష్ట్ర దొంగలు, ఇప్పుడు నగరంలో చొరబడి యథేచ్ఛగా దొంగతనాలు, దోపిడీలు చేస్తున్నారు. ఇండ్లలో చోరీలు, రాత్రిపూట ఒంటరిగా వెళ్లేవారి నుంచి సెల్‌ఫోన్లు, నగదు, ఆడవారి నుంచి మంగళసూత్రాలు దోచుకెళ్తున్నారు. కాగా పలుచోట్ల జరిగిన దొంగతనాలతో సంబంధం ఉన్నట్టు భావిస్తున్న గ్యాంగ్ సభ్యుల ఫొటోలను పోలీసులు విడుదల చేశారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వాలని శివారు ప్రజలకు సూచించారు.

దొంగిలించిన సొత్తు స్వస్థలాలకు

మధ్యప్రదేశ్‌కు చెందిన ధార్ గ్యాంగ్ నగర శివారు ప్రాంతాల్లోనే మకాం వేసినట్టు పోలీసులు గుర్తించారు. నలుగురరైదుగురు ఈ గ్యాంగ్‌లో సభ్యులుగా ఉంటారు. ఉదయం కాలనీల్లో ఆటోల్లో తిరుగుతారు. తాళం వేసిన ఇండ్లను లక్ష్యంగా చేసుకొని రాత్రిపూట చోరీలకు పాల్పడుతారు. లాడ్జీల్లో బస చేస్తారు. దొంగిలించిన సొత్తును వివిధ మార్గాల్లో వెంటనే తమ స్వస్థలానికి చేరుస్తారు. నలుగురైదుగురు గుంపుగా ఉండి చోరీలు చేస్తారు. ఎవరైనా అడ్డొస్తే దాడులు చేస్తారు. ఇటీవల హయత్‌నగర్‌లోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఐదు ఇండ్లలో దొంగతనాలు చేశారు. ఇది ధార్ గ్యాంగ్ పనేనని రాచకొండ పోలీసులు గుర్తించారు. ఎస్ఆర్‌నగర్ ఠాణా పరిధిలోని ఓ అపార్టుమెంట్‌లోకి ఇద్దరు చుడీదార్ వేసుకొని ప్రవేశించి తాళం వేసిన ఇంట్లో చోరీ చేశారు. సీసీ కెమెరాల్లో వీరి కదలికలను పోలీసులు గుర్తించారు. ఇద్దరిలో ఒకరు పురుషుడు, మరొకరు మహిళ అని అనుమానిస్తున్నా ఇప్పటివరకు ఆచూకీని మాత్రం కనుగొనలేదు.

ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం

ఇటీవల హయత్‌నగర్ ఠాణా పరిధిలో వరుస దొంగతనాలు జరిగాయి. పోయిన సొత్తు విలువ చాలా తక్కువే ఉంటుంది. దొంగల కోసం గాలిస్తున్న క్రమంలో కొంత సమాచారం అందింది. ఇది మధ్యప్రదేశ్‌కు చెందిన ధార్ గ్యాంగ్ పనే అని గుర్తించాం. ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కాలనీల్లో తిరిగితే స్థానిక పోలీసులకు, డయల్ 100కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచిస్తున్నాం. పోలీసులు అలర్ట్ అయ్యారనే సమాచారంతో దొంగలు హైదరాబాద్‌ను వదిలేసినట్టున్నారనే అనుమానాలు కలుగుతున్నాయి. ఈ గ్యాంగ్‌లను పట్టుకోవడం కోసం ప్రత్యేక బృందం గాలిస్తున్నది.

–డీసీపీ అరవింద్‌బాబు, రాచకొండ క్రైమ్స్

బైక్ డిక్కీ నుంచి 80 వేలు చోరీ

- బిడ్డ ఫీజు కట్టేందుకు వెళ్తుండగా దారుణం

డబ్బులు పోవడంతో రోదిస్తున్న వెంకన్న కుటుంబ సభ్యులు

నీలగిరి, జూన్ 14: నల్లగొండ జిల్లా కేంద్రంలో కూతురు ఫీజు చెల్లించేందుకు వెళ్తున్న వ్యక్తి నుంచి రూ. 80 వేలు కొట్టేశారు. నల్లగొండ మండలంలోని పెద్దసూరారం గ్రామానికి చెందిన గుండె వెంకన్న కూలీగా పని చేస్తున్నాడు. ఆయన బిడ్డ నల్లగొండలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ రెండో సంవత్సరం చదువుతున్నది. కూతురి ఫీజు చెల్లించడంతోపాటు విద్యా సామగ్రిని కొనుగోలు చేసేందుకు బిడ్డ, భార్యతో కలిసి బైక్‌పై నల్లగొండకు వచ్చాడు. ఎల్ఐసీ నుంచి వచ్చిన చెక్కును సెంట్రల్ యూనియన్ బ్యాంకులో జమ చేసి, అందులోంచి రూ. 80 వేలు డ్రా చేశాడు. డబ్బులను బైక్ డిక్కీలో పెట్టి ప్రకాశం బజారులోని ఓ షాపులోకి కాలేజీ బ్యాగ్ కొనేందుకు వెళ్లాడు. బ్యాంకు నుంచి అతడిని అనుసరిస్తూ వచ్చిన ఇద్దరు వ్యక్తులు గొడుగును అడ్డుగా పెట్టి బైక్ డిక్కీ లాక్‌ను పగులగొట్టారు. అందులో ఉన్న డబ్బులు కొట్టేసి పరారయ్యారు. షాపు నుంచి బయటకు వచ్చిన వెంకన్న బైక్ డిక్కీ తెరిచి ఉండడం, నగదు కనిపించకపోవడంతో భోరున విలపించాడు. వెంకన్న కూతురు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయగా, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శంకర్ అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు. దుండగులను పట్టుకుంటామని చెప్పారు.

బీజేపీ కార్యకర్త ఆత్మహత్య

- బెదిరించిన ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత
- లాకప్‌డెత్ చేస్తానని భయపెట్టిన ఎస్సై
- మనోవేదనతో పురుగు మందు తాగి మున్నూరు శేఖర్‌రెడ్డి బలవన్మరణం
- నారాయణపేట జిల్లా నర్వలో ఘటన

శేఖర్‌రెడ్డి

మక్తల్, జూన్ 14 : అవినీతికి పాల్పడ్డ ఎస్సైకి తిరిగి అదే మండలంలో పోస్టింగ్ ఇప్పిస్తుండడంపై ప్రశ్నించినందుకు ఎమ్మెల్యే, ఆయన అనుచరుడు బెదిరింపులకు దిగడం, ఎస్సై కూడా లాకప్‌డెత్ చేస్తానని భయపెట్టడంతో ఓ బీజేపీ కార్యకర్త ఆత్మహత్య చేసుకున్నట్టు అతడి కుటుంబసభ్యులు తెలిపారు. నారాయణపేట జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. గురువారం నర్వ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం కోసం స్థల పరిశీలనకు స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వెళ్లిన సమయంలో పక్కనే పొలంలో ఉన్న స్థానిక బీజేపీ కార్యకర్త మున్నూరు శేఖర్‌రెడ్డి (39) ఎమ్మెల్యేతో మాట్లాడారు. గతంలో ఇక్కడ ఎస్సైగా పనిచేసి వెళ్లిన విక్రమ్‌కు అవినీతి అధికారిగా పేరుందని, మళ్లీ అతడిని ఇక్కడికి తీసుకురావొద్దని చెప్పాడు. దీంతో ఎమ్మెల్యే, అతడి ప్రధాన అనుచరుడు, కాంగ్రెస్ పార్టీ నర్వ మండలాధ్యక్షుడు చెన్నయ్య సాగర్ కలిసి శేఖర్‌రెడ్డిని దూషించారు. 'మా ప్రభుత్వం ఉంది.. మా ఇష్టమొచ్చినట్టు చేస్తం.. అడగడానికి నువ్వెవరు' అని బెదిరించారు. శేఖర్‌రెడ్డి సంగతి చూడాలని అక్కడే ఉన్న ఎస్సై కురుమయ్యకు ఎమ్మెల్యే హుకుం జారీ చేశారు. తర్వాత చెన్నయ్య పీఎస్‌కు వెళ్లి శేఖర్‌రెడ్డిపై ఫిర్యాదు చేశాడు. అనంతరం స్టేషన్‌కు రావాలని శేఖర్‌రెడ్డికి ఎస్సై ఫోన్ చేశాడు. రాకుంటే తీసుకొచ్చి లాకప్‌డెత్ చేస్తానని భయపెట్టాడు. ఎమ్మెల్యే, ఆయన అనుచరుడు, ఎస్సై బెదిరింపులతో మనస్తాపం చెందిన శేఖర్‌రెడ్డి గురువారం సాయంత్రం ఇంట్లో పురుగుల మందు తాగినట్టు కుటుంబసభ్యులు వివరించారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన శేఖర్‌రెడ్డిని పాలమూరు ప్రభుత్వ దవాఖానకు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. స్థానిక ఎమ్మెల్యే అరాచకాలకు పాల్పడుతున్నారని బీజేపీ మండల నాయకులు ఆరోపించారు. శేఖర్‌రెడ్డి మృతికి కారణమైన ముగ్గురిపై చట్టపరమైన చర్యలు తీసుకొని మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎస్సై కురుమయ్యను వివరణ కోరగా శేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేసింది వాస్తవమేనని చెప్పారు. అయితే శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత మధ్య వివాదం తలెత్తిందని, వారి ఫిర్యాదు మేరకు శేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి స్టేషన్‌కు రావాలని ఫోన్‌చేస్తే ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

ఎంతటివారైనా ఉపేక్షించం

- లైంగికదాడి నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు పెట్టండి
- డీజీపీకి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలంలో గువ్వల సంజీవ్‌ను కొట్టి చంపిన ఘటనను సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. భౌతికదాడులకు దిగి అరాచకాలు, హత్యలకు పాల్పడే శక్తులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు తేలితే, బాధ్యులైన పోలీసు అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించారు. పెద్దపల్లి జిల్లాలో ఆరేండ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడి హత్యచేసిన ఘటనపై తీవ్రంగా స్పందించారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేస్తుందని భరోసా ఇచ్చారు.

ఆరేండ్ల బాలికపై లైంగికదాడి.. హత్య

- నిద్రిస్తుండగా ఎత్తుకెళ్లి అఘాయిత్యం
- కాట్నపల్లిలోని రైస్‌మిల్లులో ఘోరం
- బిహార్‌కు చెందిన వ్యక్తి దుర్మార్గం
- నిందితుడిని శిక్షించాలని ఆందోళన
- దహెగాంలో క్యాండిల్ ర్యాలీ

సుల్తానాబాద్‌లో రాస్తారోకో చేస్తున్న బంధువులు, స్థానిక రాజకీయ పార్టీ నాయకులు

సుల్తానాబాద్ రూరల్/ సుల్తానాబాద్/ దహెగాం, జూన్ 14: ఓ దుర్గార్కుడి కామదాహానికి అభంశుభం తెలియని ఆరేండ్ల బాలిక అసువులుబాసింది. నిద్రపోతున్న చిన్నారిని ఎత్తుకెళ్లి లైంగిక దాడిచేసి హతమార్చడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లా దహెగాంకు చెందిన దంపతులు నెల క్రితం బతుకుదెరువు కోసం ఇద్దరు బిడ్డలతో కలిసి పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లికి వచ్చి రైస్‌మిల్లులో పని చేస్తున్నారు. గురువారం రాత్రి వీరు నిద్రిస్తుండగా పక్క రైస్‌మిల్లులో పనిచేసే బిహార్ రాష్ట్రం వైశాలి జిల్లాకు చెందిన వినోద్ (రాజ్‌కుమార్) రాత్రి 11 గంటల తర్వాత కూతురు(6)ను ఎత్తుకుపోయి, చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేసి హతమార్చాడు. అర్ధరాత్రి తల్లికి మెలకువ వచ్చి చూసేసరికి బిడ్డ కనిపించలేదు. తోటి కార్మికులతో కలిసి గాలించగా, చెట్ల పొదల్లో చిన్నారి విగతజీవిగా కనిపించింది. రైస్‌మిల్లులోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించగా, నిందితుడు బాలికను ఎత్తుకెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం తెల్లవారు జామున పెద్దపల్లి డీసీపీ చైతన్య, ఏసీపీ కృష్ణ, పెద్దపల్లి సీఐ సుబ్బారెడ్డి, సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాలిక మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం సుల్తానాబాద్ దవాఖానకు తరలించారు. బిడ్డపై ఇంతటి ఘోరం జరగడంతో తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని వేడుకుంటున్నారు.

దహెగాంలో విషాదం

బాలిక మరణంతో దహెగాంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇలాంటి అన్యాయం మరేబిడ్డకు జరగవద్దని, దుర్మార్గుడిని కఠినంగా శిక్షించాలని బంధువులు, గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఆరెకుల సంక్షేమ సంఘం నాయకులు దహెగాం తహసీల్దార్, ఎస్ఐని కలిసి నిందితుడిని బహిరంగంగా శిక్షించాలని , మిల్లు యాజమానులపైనా చట్టపరంగా చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. బాలిక ఆత్మకు శాంతి కలగాలని మండలకేంద్రంలో యువకులు కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. 'కామాంధుడికి ఉరే సరి'అని నినాదాలతో హోరెత్తించారు. అంగడిబజార్‌లో చిన్నారి చిత్రపటానికి నివాళులర్పించారు.

కామాంధుడిని శిక్షించాలని రాస్తారోకో

చిన్నారిని పొట్టనబెట్టుకున్న కామాంధుడిని కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు, బంధువులు సుల్తానాబాద్ తెలంగాణ చౌరస్తాలో శుక్రవారం పెద్ద ఎత్తున రాస్తారోకో చేశారు. న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ బైఠాయించారు. వీరికి వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. పోలీసులు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఆందోళనను విరమింపజేశారు.

మద్యం మత్తులో వీరంగం

- న్యూసెన్స్ వద్దన్నందుకు ఇంటిపై రాళ్లు, సీసాలు విసిరిన యువకులు
- యజమానిపై కర్రలతో దాడి

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 14 (నమస్తే తెలంగాణ): అర్ధరాత్రి న్యూసెన్స్ చేయవద్దన్నందుకు మద్యం మత్తులో యువకులు వీరంగం సృష్టించారు. ఓ ఇంటిపైకి రాళ్లు, మద్యంబాటిళ్లను రువ్వడమే కాకుండా అడ్డువచ్చిన యజమానికి కర్రలతో కొట్టారు. ఈ ఘటన గురువారం రాత్రి సరూర్‌నగర్ పీఎస్ పరిధిలో జరిగింది. చైతన్యపురి మెట్రోస్టేషన్ సమీపంలోని నేతాజీనగర్‌లో ఉన్న ఖాళీ స్థలంలో గురువారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో శంకు యాదవ్, వంశీ, షాహిద్, హరీశ్, సోను, సుమన్ మరికొందరు కలిసి స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలు చేసుకున్నారు. మద్యం మత్తులో గట్టిగా అరుస్తూ హంగామా చేశారు. ఎదురుగా ఉండే ఓ వ్యక్తి వచ్చి ఇక్కడ న్యూసెన్స్ చేయవద్దని, అలాచేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించి వాళ్ల ఫొటోలు తీసుకొని వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత ఆ యువకులు ఎదురింటిపై రాళ్లు విసురుతూ భయభ్రాంతులకు గురిచేశారు. ఇంటి యజమాని జనార్ధన్‌నాయుడు వచ్చి తన ఇంటిపై జరిగిన దాడి, ధ్వంసమైన అద్దాలను పరిశీలిస్తుండగా యువకులు వచ్చి కర్రలతో విచక్షణారహితంగా కొట్టారు. ఈ ఘటన అక్కడున్న సీసీ కెమెరాల్లో రికార్డవడంతో సోషల్ మీడియాలో వైరలైంది.

పాత కక్షలతో పొడిచి చంపేశారు

- అందరూ చూస్తుండగానే దుండగుల ఘాతుకం
- ఆసిఫ్‌నగర్‌లో దారుణం

మెహిదీపట్నం, జూన్ 14: నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే ఓ యువకుడిని కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం కలకలం రేపింది. పాతకక్షల నేపథ్యంలోనే యువకుడిని హత్య చేసినట్టు ఆసిఫ్‌నగర్ ఏసీపీ కిషన్ వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిరుడు ఆగస్టు 27న ఆసిఫ్‌నగర్‌కు చెందిన ముజాహిద్‌ను, అదే ప్రాంతానికి చెందిన అబ్దుల్ ఖుద్దూస్(27) మరికొందరితో కలిసి హత్య చేశాడు. దీంతో కక్ష పెంచుకున్న ముజాహిద్ సోదరులు గురువారం అర్ధరాత్రి ఆసిఫ్‌నగర్ క్రాస్‌రోడ్ సమీపంలో ఖుద్దూస్ వెంటపడి వేటాడారు. అందరూ చూస్తుండగానే కత్తులతో దాడి చేసి ఖుద్దూస్‌ను తీవ్రంగా గాయపరిచారు. అనంతరం నిందితులు పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రగాయాలైన ఖుద్దూస్‌ను ఉస్మానియా దవాఖానకు చికిత్సకోసం తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శుక్రవారం తెల్లవారుజామున ఖుద్దూస్ మృతిచెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత గొంతుకోసి దారుణ హత్య

- చందానగర్ పోలీసుల అదుపులో నిందితుడు?

కొండాపూర్, జూన్ 14 : వివాహిత గొంతు కోసి దారుణంగా హతమార్చిన సంఘటన చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకొన్నది. సీఐ పాలవెల్లి తెలిపిన వివరాల ప్రకారం... కర్ణాటక సేడం ప్రాంతానికి చెందిన విజయలక్ష్మి (32) తన కుటుంబంతో హైదరాబాద్‌కు వలస వచ్చి.. నల్లగండ్ల లక్ష్మీ విహార్ ఫేజ్ -1లో నివాసముంటున్నది. స్థానిక అపర్ణ టవర్స్‌లో వంట మనిషిగా పని చేస్తున్నది. విజయలక్ష్మీ సోదరుడు సునీల్.. ఆటోడ్రైవర్ భరత్ అలియాస్ శ్రీనివాస్ గౌడ్ దగ్గరి నుంచి ఫైనాన్స్ కింద కొంత నగదు తీసుకొన్నాడు. ఈ విషయంలో ఇరువురి మధ్య గొడవ జరిగి పోలీసు కేసు వరకు వెళ్ళగా, ఇటీవలే లోక్ అదాలత్‌లో కేసును ఉపసంహరించుకొన్నట్టు సమాచారం. శుక్రవారం మధ్యాహ్నం విజయలక్ష్మి ఇంట్లోకి శ్రీనివాస్‌గౌడ్ చొరబడి కత్తితో ఆమెను గొంతును గాయపరిచి, దారుణహత్య చేశాడు. వీరి మధ్య ఆర్థిక లావాదేవీలా... వివాహిత సంబంధంతో హత్యకు దారితీసిందన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. కాగా హంతకుడు శ్రీనివాస్‌గౌడ్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రాణం తీసిన భూతగాదా

- మృతుడు బీజేపీ కార్యకర్త
- నారాయణపేట జిల్లాలో ఘటన

నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం చిన్నపొర్ల గ్రామంలో బీజేపీ నేత సంజీవ్‌పై కర్రలతో దాడి చేస్తున్న దాయాదులు

ఊట్కూర్, జూన్ 14 : భూతగాదాకు ఒకరు బలయ్యారు. ఈ ఘటన నారాయణపేట జిల్లాలో చోటుచేసుకున్నది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఊట్కూర్ మండలం చిన్నపొర్ల గ్రామంలోని దళిత కాలనీకి చెందిన గువ్వలి లక్ష్మప్పకు ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు ఎర్రగండ్ల సంజప్ప, రెండో భార్యకు పెద్ద సవారప్ప, చిన్న సవారప్ప సంతానం. అతడి పేరిట ఉన్న 9 ఎకరాలను ముగ్గురు కొడుకులకు సమానంగా బదలాయించాడు. తర్వాత కొన్నేండ్లకు లక్ష్మప్ప మృతి చెందగా.. అతడి కుమారులు భూపంపకాలను వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించారు. కొన్నేండ్లుగా వీరి మధ్య వివాదం సాగుతున్నది. కాగా గురువారం పెద్ద సవారప్ప, అతడి కుమారుడు సంజీవ్(28), సోదరుడు చిన్న సవారప్ప, మరదలు కవిత వారి పేరుపై ఉన్న పొలంలో విత్తనాలు విత్తేందుకు వెళ్లారు. వీరిపై దాయాదులు ఆశప్ప, గుట్టప్ప, చిన్న వెంకటప్ప, ఆటో సంజీవ్, శ్రీను, కిష్టప్ప, నట్టలప్ప తోపాటు మరికొందరు రాళ్లు, కర్రలతో దాడికి తెగబడ్డారు. తీవ్రంగా గాయపడిన సంజీవ్‌ను నారాయణపేట జిల్లా దవాఖానకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య అనిత, పిల్లలు సాత్విక్, వంశీ ఉన్నారు. కాగా గ్రామంలో ఉద్రిక్తత నెలకొనగా.. మక్తల్ సీఐ చంద్రశేఖర్ పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. దాడికి కారణమైన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. దాయాదుల మధ్య ఘర్షణ జరుగుతున్న విషయాన్ని బాధిత కుటుంబం, స్థానికులు డయల్ 100కు సమాచారం అందించినా ఎస్సై ఆలస్యంగా స్పందించారని తెలిసింది. బీజేపీలో క్రియాశీలక కార్యకర్తగా ఉన్న సంజీవ్.. తమకు దాయాదుల నుంచి ముప్పు పొంచి ఉన్నదని పది రోజుల కిందటే పోలీసులను ఆశ్రయించాడు. అయితే దాడి చేసింది కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కావడంతో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

సంజీవ్ (ఫైల్)

న్యాయవాదిని బెదిరించిన ఎస్సై

మహబూబ్‌నగర్, జూన్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో సివిల్ పంచాయితీలో తలదూర్చినందుకు పోలీసులను న్యాయవాది సురేశ్‌గౌడ్ ప్రశ్నించారు. దీంతో స్థానిక ఎస్సై విజయ్ భాస్కర్ ఏకంగా అడ్వకేట్ అని కూడా చూడకుండా బెదిరించి, దుర్భాషలాడారు. దీన్ని నిరసిస్తూ గద్వాల జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ మేరకు జడ్జీలకు, డీఎస్పీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.

అటవీ అధికారులపై దాడి

వినాయకనగర్/ఇందల్వాయి, జూన్ 14: నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కాల్పోల్ అటవీ ప్రాంతంలో ప్లాంటేషన్ స్థలంలో కొందరు ట్రాక్టర్లతో దున్నుతున్నట్లు తెలిసి నిజామాబాద్ సౌత్ రేంజ్ ఆఫీసర్ రాధికసిబ్బందితో కలిసి వెళ్లారు. గమనించిన స్థానికులు కర్రలు, మట్టిపెళ్లలతో దాడి చేయడంతో ఎఫ్ఆర్వో, సెక్షన్ ఆఫీసర్ సాయికృష్ణ, ముగ్గురు బీట్ ఆఫీసర్లు గాయపడ్డారు. అటవీ అధికారుల సమాచారంతో నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐ సురేశ్‌కుమార్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. 30 మంది తమపై దాడి చేశారని అటవీ సిబ్బంది ఫిర్యాదు చేయగా, వారిపై కేసు నమోదు చేశారు. దాడి చేసిన వారిపైవారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని బాసర యూనిట్ రేంజ్ అధికారుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, ఇందల్వాయి రేంజ్ అధికారి రవిమోహన్ భట్ డిమాండ్ చేశారు.

5 టన్నుల గంజాయి ధ్వంసం

- 'సైబరాబాద్' పరిధిలో 122కేసులు
- డ్రగ్స్ పట్టుకున్న పోలీసులు

స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 14 (నమస్తే తెలంగాణ): మత్తు మాఫియాపై ఉక్కుపాదం మోపుతున్న సైబరాబాద్ పోలీసులు, మూడేండ్లలో స్వాధీనం చేసుకున్న మొత్తం 5006కిలోల (5టన్నుల) గంజాయి, 15రకాల డ్రగ్స్‌ను సైబరాబాద్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. కమిషనరేట్‌కు చెందిన 30పోలీస్‌స్టేషన్ల పరిధిలో పెద్దఎత్తున డ్రగ్ మాఫియాపై దాడులు జరిపి 122కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో పలువురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 5006.934కిలోల గంజాయి, కొకైన్, హషీష్ ఆయిల్, చరాస్, ఎల్ఎస్‌డీ, ఎస్టసీ మాత్రలు, ఎస్టసీ పౌడర్, హెరాయిన్, ఓపీఎం, మెథపెటమైన్ వంటి 15రకాల డ్రగ్స్‌ను సీజ్ చేశారు. పోలీస్‌కమిషనర్ ఆదేశాలతో డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ కొత్తపల్లి నర్సింహ ఆధ్వర్యంలో సైబర్‌క్రైమ్ ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీసీఆర్బీ ఏసీపీ కలింగరావు, నార్కోటిక్స్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ శుక్రవారం నందిగామ మండలం, ఏదులపల్లిలోని జీజే మల్టీక్లేవ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో మత్తు పదార్థాలను ధ్వంసం చేశారు.

కరెంట్ షాక్‌తో కౌలురైతు మృతి

వినాయక్‌నగర్, జూన్ 14: వ్యవసాయభూమిలో విద్యుత్తు తీగను సరిచేస్తుండగా కరెంట్‌షాక్‌తో కౌలురైతు మృతి చెందాడు. ఈ ఘటన నిజామాబాద్ రూరల్ మండలం ఖానాపూర్‌లో చోటుచేసుకున్నది. ఎస్సై మహేశ్ వివరాల ప్రకారం.. అంబేద్కర్‌కాలనీకి చెందిన నిమ్మ శంకర్(68) ఆరేండ్లుగా ఖానాపూర్ శివారులో సత్యపాల్ మిశ్రాకు చెందిన వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. గురువారం పొలం వద్దకు వెళ్లిన శంకర్ బోరుమోటర్‌కు సరఫరా అయ్యే విద్యుత్తు తీగ తెగి ఉండటాన్ని గమనించాడు. సరిచేసే క్రమంలో విద్యుత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య నిమ్మ రాజామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్ నేత హోటల్ కూల్చివేత

- కోర్టు స్టే ఉన్నా కూల్చివేశారని ఆరోపణలు
- సూర్యాపేటలో ఘటన

సూర్యాపేటలో అధికారులు కూల్చివేసిన జాజు హోటల్

బొడ్రాయిబజార్, జూన్ 14 : సూర్యాపేటలో బీఆర్ఎస్ జిల్లా నేతకు చెందిన హోటల్‌ను అధికారులు రాత్రికి రాత్రి కూల్చివేశారు. సూర్యాపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు గండూరి ప్రకాశ్‌కు పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్‌పై జాజు హోటల్ ఉన్నది. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయ